సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 3: వివిధ ఆనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 23 మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 8,56,500 విలువ గల చెక్కులను మంగళవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దైద రజితా వెంకట్ రెడ్డి, పాదూరి ఇంద్ర సేనారెడ్డి, నాగులవంచ వెంకటేశ్వర్లు రావు, రేగట్టే సైదులు గౌడ్, సత్యనారాయణ, బొంత శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి

- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పక్కన కలెక్టర్

మునుగోడు(చండూరు), సెప్టెంబర్3 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో చండూరు, నాంపల్లి మండ లాల, మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా వైద్యం, పంచాయతీరాజ్, ధరణి, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ, రోడ్లు, విద్యుత్ అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా తగిన జాగత్తలు చేపట్టాలన్నారు. చండూరు రెవెన్యూ డివిజన్‌లో ఆర్డీఓ, తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలో బీసీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ ఆస్పత్రి, డబుల్ రోడ్డు పనులును, జడ్పీహెచ్‌ఎస్‌లో వసతులను, భవనాలను ఎమ్మెల్యే పరిశీలించారు.

ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం కృషి

- ఎమ్మెల్యే బాలూనాయక్

డిండి ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

చందంపేట/డిండి, సెప్టెంబర్ 3 : నక్కలగండి ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపునకు గురవుతున్న రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించేందుకు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. నక్కలగండి వెనుక జలాల నీరు సమీప ఇండ్లల్లోకి చేరడంతో మంగళవారం బాధితులను ఆయన పరామర్శించారు. నక్కలండి ప్రాజెక్టుతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పంట నష్టం వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చందంపేట, నేరేడుగొమ్ము మండలాల పరిధిలో ఉన్న చెరువులను నింపేందుకు డిండి ప్రాజెక్టు నీటిని కామేపల్లి వద్ద తూము ద్వారా విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, తాసీల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు పార్వతీచందునాయక్, ముత్యాల సర్వ య్య, గోవిందుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, మాజీ జడ్పీటీసీ బుజ్జీ లచ్చిరాంనాయక్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం డిండి ప్రాజెక్టు అలుగు పోస్తుండంతో దేవరకొండ, అచ్చంపేట ఎమ్మెల్యేలు ప్రాజెక్టును సందర్శించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 3: పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4 నుంచి 6 వరకు రాష్ట్ర స్థాయి అండర్ -11 బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు తెలిపారు. మంగళవారం స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 200కు పైగా బాలబాలికలు పాల్గొననున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నామన్నారు. పోటీలను ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో టోర్నీ ఆర్గనైజింగ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అంజయ్య, సభ్యులు నీవీన్ కుమార్, మారబోయిన రామకృష్ణ, వనమాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీహెచ్‌ఓ

కేజీబీవీని పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్

మిర్యాలగూడ(వేములపల్లి)/ మాడ్గులపల్లి, సెప్టెంబర్ 3: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. మంగళవారం వేములపల్లి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరాల బారిన పడిన వారి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సోమాచారి, ఏఎన్ఎం శైలజ, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ఏఎన్ఎం లు ఝాన్సీ, జ్యోతి, టీచర్లు పాల్గొన్నారు

గ్రామస్తుల చేతిలో కొండ చిలువ హతం

పెద్దవూర, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని కర్నాటి సత్యనారాయణరెడ్డి బత్తాయి తోటలో మంగళవారం ఉదయం కొండ చిలువ కనిపించింది. గమనించిన కూలీలు రైతుకు సమాచారం ఇవ్వడంతో వారు కర్రలతో కొట్టి చంపారు. కొండచిలువ కొన్ని రోజులుగా తోటలోని కోళ్లను తింటున్నదని రైతు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది
కొమిరెల్లి శ్రీనివాస్ రెడ్డి, S/o.కొమిరెల్లి ప్రతాప్‌రెడ్డి, R/o. (V) పెద్దకొండూరు, (M) చౌటుప్పల్, Dist. నల్లగొండ నివాసికి చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్ (No.13800/2016), DVK రోడ్ నుండి నల్లగొండ టౌన్‌కి ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర||9948041912.

PLOT FOR SALE
★హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ... శ్రీశైలం హైవే HMDA, DTCP ప్లాట్లు కలవు. ఇప్పుడు మాత్రమే తక్కువ ధరలో మహేశ్వరం, ముచ్చర్ల... మరో న్యూయార్క్. Cont: 8008091512.
NT-332640

NLG-
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
మరిన్ని వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నాం

- వేములపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినుల ఆందోళన

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ(వేములపల్లి), సెప్టెంబర్ 3: వంద మంది ఉండాల్సిన హాస్టల్‌లో 350 మందిని ఉంచారు. ఇరుకు గదుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నం. మా బాధలు తీర్చండి అంటూ వేములపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థినులు మంగళవారం పాఠశాల గేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములపల్లి మోడల్ స్కూల్ భవనంలోనే మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థినులను సైతం ఉంచడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఒకే గదిలో పదుల సంఖ్యలో విద్యార్థినులను ఉంచడంతో కనీసం పడుకునేందుకు కూడా స్థలం ఉండడం లేదని, కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన భవనంలో ఉన్న కేజీబీవీని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంఈవో బాలాజీనాయక్ వారితో మాట్లాడారు. కేజీబీవీ విద్యార్థినులను త్వరలో వేరే చోటుకు మారుస్తామని చెప్పినా వారు వినిపించుకోకుండా మూడు గంటల పాటు పాఠశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. దాంతో ఉపాధ్యాయులు, ఇతర విద్యార్థినులు కూడా రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అక్కడికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. వారం రోజుల్లో కేజీబీవీని వేరే ప్రాంతానికి మారుస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి

విద్యార్థులతో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శాలిగౌరారం, సెప్టెంబర్3 : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కేజీబీవీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వ ర్యంలో గర్భిణులకు అందించిన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి ఉన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడ్‌లెన్స్‌పై అవగాహన కల్పించాలి

- డీఈఓ భిక్షపతి

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్3 : ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడ్‌లెన్స్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. మంగళ వారం మండలంలోని తుంగపహాడ్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. డిజిటల్ పద్ధతిలో పాఠాలు బోధించాలని, అనంతరం పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలను విద్యార్థులు చదివేలా చూడాలని సూచించారు. ప్రతి రోజు ఒక పీరియడ్ కేటాయించి లైబ్రరీలో గడిపేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీ నాయక్, ప్రిన్సిపాల్ దీనాసుజాత ఉన్నారు.

సమయ పాలన పాటించని వైద్యులు.. రోగుల ఇబ్బందులు

కమలా నెహ్రూ ఏరియా దవాఖానలో విచిత్ర పరిస్థితి

వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

నందికొండ, సెప్టెంబర్ 3 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా దవాఖానలో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. కేవలం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకే ఉంటున్నారని, ఆ తర్వాత ఎవరూ కనిపించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 12 గంటల తర్వాత వైద్యులు ఉండక పోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

విషజ్వరాలతో పెరిగిన రోగుల సంఖ్య

ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలు తుండడంతో ప్రతిరోజూ అధిక సంఖ్యలో రోగులు దవాఖానకు వస్తున్నారు. అయితే వారికి వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తున్నది. మంగళవారం మధ్యాహ్నం వచ్చిన రోగులకు వైద్యం అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది లేక పోవడంతో వారు కోసం గంటల తరబడి వేచి చూసి వెనుతిరిగి వెళ్లారు. తాను ఓపీ రాయించుకొని గంటల తరబడి వేచిఉన్నా డాక్టర్లు రాలేదని చింతలపాలెం గ్రామానికి చెందిన కాశయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కనీసం సూదిమందు ఇచ్చేందుకు కూడా నర్సులు లేరని తెలిపాడు. పత్యేక విభాగం చెందిన డాక్టర్లు రోగులను పట్టించుకోకపోగ, తమ క్లినిక్‌కు రావలసిందిగా కోరుతున్నారని రోగులు చెబుతున్నారు.

రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు : సీఎంఓ భానుప్రసాద్

రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవలను అందిస్తున్నాం, డాక్టర్లు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఉంటున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రమత్తంగా ఉన్నాం. దవాఖానలో రోగుల సేవలకు ఎటువంటి ఇబ్బంది లేదు.

ఉపాధిహామీ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్, సెప్టెంబర్ 3 : గ్రామస్థాయి అధికారులు ఉపాధిహామీ పథకానికి సంబంధించిన ఏడు రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నకిరేకల్ మండల 14వ విడుత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు నిర్వహించిన పనులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పనిప్రదేశంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ నీహెచ్ వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మెన్ ఎండీ గౌరీ, ఎస్క్యూసీఓ ఎండీ ఫసీయుద్దీన్, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ పి. గౌతమి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ రమణయ్య పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన చెర్వుగట్టు

స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 3 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మంగళవారం అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ లక్ష పుష్పార్చన నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 3: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకుగాను పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్ర ప్రభుత్వం తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఎంపిక చేసిందని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నాయకుని తండా, నెల్లికల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, కృష్ణానాయక్, చంద్రారెడ్డి, మునినాయక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే చేపట్టాలి : అదనపు కలెక్టర్

హాలియా, సెప్టెంబర్ 3 : బీఎల్ఓలు ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌లు ఆదేశించారు. మంగళవారం అనుముల మండలం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రతాప్‌నగర్, బోడ్రాయిబజారులో తాసీల్దార్ జయశ్రీ, బీఎల్ఓతో కలిసి సర్వేను పరిశీలించారు. ఆయన వెంట బీఎల్ఓ అక్బర్, ఆవుల మహేశ్ ఉన్నారు.

ఉమెన్స్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ కోసం దరఖాస్తులు

రామగిరి, సెప్టెంబర్ 3: నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీతోపాటు నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. తెలుగు, హిందీ, ఎకానామిక్స్, పొలిటికల్ సైన్స్ ఉర్దూ, కంప్యూటర్ సైన్స్, మైక్రోబయాలజీలో ఒక్కో పోస్టు, ఫిజిక్స్, జువాలజీలో మూడు పోస్టులు చొప్పున ఖాలీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 8వరకు కళాశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎం.సుదర్శన్‌రెడ్డి 9949988926, ధర్మేందర్ 9949551935ను సంప్రదించాలని కోరారు.

'పెండింగ్ స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలి'

రామగిరి, సెప్టెంబర్ 3: విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నల్లగొండ విభాగ్ కన్వీనర్ సురభి మణికంఠ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాదికి సంబంధించిన రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దాంతో పేద విద్యార్థులు విద్యకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వినాయక మంటపాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలి : కమిషనర్

మిర్యాలగూడటౌన్, సెప్టెంబర్ 3: వినాయకచవితి పండుగ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసే వినాయక మంటపాల వద్ద, కొనుగోలు కేంద్రాల వద్ద పారిశుధ్యం మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్‌అలీ శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు.

పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా మూనా

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబర్ 3 : పీఆర్‌టీయూ పీఏపల్లి మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. మూనా, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమణి అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మంచికంటి మధు వ్యవహరించారు.

వరద బాధితుల కోసం ఒక రోజు వేతనం విరాళం

- బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ

మిర్యాలగూడటౌన్, సెప్టెంబర్3: రాష్ట్రంలో వరద బాధితుల కోసం ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘాలు ఒకరోజు వేతనాన్ని సీఎం సహాయనిధికి అందించినట్లు బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విరాళాలు ఇచ్చేందుకు బంజారా ఉద్యోగుల సంఘం స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. వరదల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం బాధ కలిగించిందన్నారు. సంఘం నాయకులు గోపి, మక్క, శ్రీను, హరి, రమేశ్, లాలు, మోతీలాల్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మర్రిగూడ, సెప్టెంబర్ 3 : మండలంలోని సరంపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బొడ్డు శంకర్, మాజీ ఉప సర్పంచ్ జిల్లాకుల సైదులుయాదవ్, యూత్ ఫర్ సేవా సభ్యులు యాదగిరి, ఆంబోతు భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల భోజనంలో నాణ్యత లేదని ఆందోళన

నందికొండ, సెప్టెంబర్ 3 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తున్నాయని, దాంతో తమ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను వివరణ కోరగా గతంలో అన్నంలో పురుగులు వచ్చినట్లు విద్యార్థులు ఫిర్యాదు చేశారని, దాంతో ప్రస్తుతం బియ్యం బాగా కడిగి వండుతున్నట్లు తెలిపారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 3: సీఎం సహాయనిధిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.18,96,500 విలువైన చెక్కులను మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వారు అందించి మాట్లాడారు. అనారోగ్యం బారిన పడిన పేదలకు సీఎం సహాయనిధి వరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబునాయక్, మాజీ వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

నాటిన మొక్కల లెక్కలు తేలుస్తున్నరు

- మండలానికో గ్రామాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక టీం

సర్వే చేస్తున్న ప్రత్యేక టీమ్ సభ్యులు

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 3: వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది నాటాల్సిన మొక్కలన్నీ నాటారా లేదా అనే లెక్కలను అధికారులు తేల్చే పనిలో పడ్డారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. మండలానికి ఒక గ్రామా న్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామంలో నర్సరీలో పెంచిన మొక్కలెన్ని, నాటినవెన్ని, రీప్లేస్‌మెంట్ చేసినవెన్ని, మిగిలినవెన్ని అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో మంగళవారం ప్రత్యేక టీమ్ గ్రామంలోని పల్లెప్రకృతి వనంతో పాటు గ్రామంలో నాటిన మొక్కలు, ఇండ్లకు పంపిణీ చేసిన మొక్కలను పరిశీలించారు. పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు డి.చైతన్య, యూసఫ్ అలీ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఏపీఓ స్ఫూర్తి, టీఏ సోమయ్య, ప్రమీళ, పంచాయతీ కార్యదర్శి అనిమల్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

సాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

నందికొండ, సెప్టెంబర్ 3 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి 3,43,012 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. దాంతో అధికారులు మంగళవారం కూడా ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 16 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 3,04,320 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586 అడుగులుగా ఉంది. ప్రాజెక్ట్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,979 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం మీద ప్రాజెక్ట్ నుంచి 3,43,012 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది.

**మూసీకి 6,277 క్యూసెక్క